శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



తాడిమర్రిలో పూజలందుకున్న కన్యకా పరమేశ్వరి



ధర్మవరం పట్టణంలో పార్వతీ పరమేశ్వరుల అలంకరణలో కన్యకా పరమేశ్వరీ దేవి

పుట్టపర్తి టౌన్/కదిరి టౌన్/ధర్మవరం అర్బన్/తనకల్లు/నల్లచెరువు/తాడిమర్రి/బత్తలపల్లి: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పట్టణాలతో పలు ఆలయాల్లో తొలి రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పుటపర్తి సమీపంలోని ఎనుములపల్లి సాయిబాబా గుడి ఆవరణలో దుర్గమ్మ శైలిపుత్ర అమ్మవారిగా దర్శనమిచ్చారు. ప్రశాంతి గ్రామం వద్ద ఉన్న దుర్గమ్మ బాలత్రిపుర సుందరి అమ్మవారిగా భక్తులను కరుణించారు. పలు ఆలయాల్లో చండీయాగం నిర్వహించారు. కదిరిలోని చౌడేశ్వరి దేవి, మరకత మహాలక్ష్మి, వాసవీమాతను వివిధ రూపాల్లో అలంకరించారు. తనకల్లులోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా ఆదివారం అమ్మవారి మూల విరాట్‌ను పసుపుతో ప్రత్యేకంగా అలంకరించారు. నల్లచెరువు మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. తాడిమర్రిలోని కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో భక్తులు అమ్మవారికి పూజలు చేపట్టారు. బత్తలపల్లిలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేదపండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ ఆలయాల్లోనూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడి ఆలయంలో అమ్మవారిని దుర్గా దేవిగా అలంకరించి పూజలు చేశారు. సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో వెలసిన మహంకాళీమాత ఆలయంలో శరన్నవరాత్రులల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ఉప సర్పంచ్ కోటి గోపీనాథ్, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో కొలువుదీరిన దుర్గామాత విగ్రహం



కదిరి పట్టణంలో రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో వాసవీ మాత



నల్లచెరువులో బాలా త్రిపుర సుందరిగా వాసవీ కన్యకా పరమేశ్వరి



తనకల్లులో పూజలందుకున్న కన్యకా పరమేశ్వరి

క్లుప్తంగా

108లో ప్రసవం



బిడ్డను చూపుతున్న సిబ్బంది

కనగానపల్లి: పురిటి నొప్పులతో ఉన్న ఓ గర్భిణి ఆస్పత్రికి వెళ్తూ 108 వాహనంలో ప్రసవించింది. మండలంలోని కోనాపురానికి చెందిన రమేష్ భార్య మల్లేశ్వరికి ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఆమెను 108 వాహనంలో కనగానపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. నొప్పులు అధికం కావడంతో మెడికల్ టెక్నీషియన్ రమేష్, పైలెట్ సురేంద్రనాయక్ వాహనాన్ని ఆపి అందులోనే ప్రసవం చేయించారు. దీంతో ఆమెకు సుఖ ప్రసవమై ఆడ బిడ్డకు జన్మనిచ్చింది.

ఆర్థికసాయం అందజేత

తనకల్లు: ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న స్థానిక హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామాంజులులుకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అండగా నిలిచారు. రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. ఆ మొత్తాన్ని ఆదివారం మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా రామాంజులులుకు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, మైనార్టీ నాయకులు బీఎస్ నిజాం, ఎస్సీ నాయకులు శ్రీనివాసులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుమిత్ర

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలకు చెందిన సుమిత్ర కుటుంబ కలహాలతో ఆదివారం గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు భర్త పెద్దన్న తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బత్తలపల్లి: చేతులను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండవచ్చని శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా బత్తలపల్లి గ్రామ సచివాలయంలో చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల, మూత్ర విసర్జనకు వెళ్లినప్పుడు కాళ్లు, చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల సగం జబ్బులను నియంత్రించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కిం కాశమ్మ, ఎస్‌బీఎం జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎస్‌బీఎం మండల కో–ఆర్డినేటర్ ఆదినారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని ఓబుల నాయనపల్లికి చెందిన లింగయ్య (75) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గత కొంత కాలంగా లింగయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

100 లీటర్ల సారా ధ్వంసం



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓడీచెరువు: మండలంలోని నాయనాకోట తండా సమీపంలోని పొలాల్లో ఆదివారం 100 లీటర్ల ఊటసారాను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సమాచారం మేరకు తండా పొలాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. ఊటసారాను గుర్తించి, ధ్వంసం చేశామన్నారు. అలాగే తండాకు చెందిన తావ్రేనాయక్ ఇంటిముందు నాటుసారా కాల్చుతుండగా బట్టీని పగులగొట్టి 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. తావ్రేనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కిశోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పర్యటన

కొత్తచెరువు: మండల పరిధిలోని నారేపల్లి కేశాపురం, మైలసముద్రం పంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పర్యటిస్తారని పార్టీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు పంచాయతీల్లోని కార్యకర్తలతో సమావేశం అవుతారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలి? తదితర విషయాలపై పార్టీ కార్యకర్తలకు అవగాహక కల్పిస్తారని పేర్కొన్నారు.

శుభకార్యం

కొత్తచెరువుకు చెందిన మాజీ వార్డు మెంబర్ హఫీజ్ ఖాన్ కుమార్తె వివాహం ఆదివారం ధర్మవరం రహదారిలోని ఓ పంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు.

తూంచర్లలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కనగానపల్లి: మండలంలోని తూంచర్లలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తారన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

తలుపుల: మండల కేంద్రంలోని డిప్పుల చేలో ఆదివారం బలిజపేటకు చెందిన యువకుల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని ఎస్‌ఐ మగ్బూల్ బాషా ప్రారంభించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



ఆర్బీకేను ప్రారంభించిన అనంతరం సిబ్బంది, నాయకులతో ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఓబులరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకేలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా సేవలు అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లోనే సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌సెంటర్లు నిర్మించడం జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, మాజీ జెడ్పీవైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామక్రిష్ణారెడ్డి,తహసీల్దార్ శ్రీదర్,ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు,ఎంపీపీ రఫినాయక్, సర్పంచ్ సుమియా, అగ్రి బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు సూర్యనారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, స్థల దాతలు పాపిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు శ్రీరామ్‌రెడ్డి, పెద్దినాయుడు, దివాన్‌వలి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శం



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంపీ తలారి రంగయ్య

బత్తలపల్లి: రామాయణం రచించిన వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శమని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వాల్మీకి రామాయణాన్ని అనుసరించాలన్నారు. తరాలు మారినా యుగాలు మారినా ఇప్పటికీ రామాయణం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నేటి సమాజంలో బోయలు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. వారందరూ రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కోరారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. అంతకు ముందు ఉదయం 6:30 నుంచి పుణ్యాహవచనం, గోప్రదక్షణ, గణపతి పూజ, అంకురార్పణ, హోమాలు, పంచామృతభిషేకము చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ చెడిపోతుల గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంసీ నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, లాయర్ సూర్యప్రకాష్‌రావు, బోయ సంఘం జిల్లా అధ్యక్షులు సాంబశివ, హిందూపురం అంబికా లక్ష్మీనారాయణ, అమరావతి ఆసుపత్రి ఎండీ అంకే ముత్యాలన్న, బోయ రవిచంద్ర, సాకే మద్దిలేటి, కనగానపల్లి లక్ష్మన్న, గోరంట్ల లక్ష్మీనారాయణ, కదిరి బంగారు కృష్ణమూర్తి, లాయర్ అసోసియేషన్ చంద్రాచర్ల హరి, మదనపల్లి పులి శ్రీనివాసులు, గుత్తి బాచి, ముదిగుబ్బ ఎంపీటీసీ రామకృష్ణ, చెన్నరాయపట్నం లింగమయ్య, అప్పరాచెరువు ఈశ్వరయ్య, రాఘవంపల్లి నరసింహుడు, కుంటిమద్ది రమణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి మృతి



న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి (ఫైల్)

కదిరి: కదిరిలో ప్రముఖ సీనియర్ న్యాయవాది ఏ.చంద్రశేఖరరెడ్డి (58) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆయన శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కన్ను మూశారు. చంద్రశేఖరరెడ్డికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు సాయి సిద్దార్థ్ రెడ్డి ఉన్నారు. నల్లమాడ మండలం పుల్లగూర పల్లిలో సోమవారం చంద్రశేఖర్‌రెడ్డి అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

నివాళి..



పుల్లగూరపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: పుట్టపర్తి, కదిరి ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పుల్లగూరపల్లిలో చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి ఆకస్మిక మృతికి సంతాపం తెలిపారు.

వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



అమడగూరు మండలం మద్దెమ్మగుడిపల్లిలో బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పూలకుంటపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని తలమర్లపల్లి, కరిమిరెడ్డిపల్లి, మద్దెమ్మగుడిపల్లి, దూదరగుట్ట, లోకోజుపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గత నాలుగన్నరేళ్లలో ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం జగన్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నలభై ఏళ్లగా తారురోడ్డు లేని గ్రామాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తారురోడ్లు వేశామని గుర్తు చేశారు. అలాగే గ్రామాల్లో సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ ఉచితంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లను ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఒక్క ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఇప్పుడు అడిగిన వారందరికీ కుల, మత, పార్టీ, విభేదాలు లేకుండా ఇళ్లను మంజూరు చేస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ జలకళ కింద అర్హులైన రైతులందరికీ ఉచితంగా బోరుబావులను వేయించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేశామని స్పష్టం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మీరంతా ప్రభుత్వానికి తోడుగా ఉండి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శేషూరెడ్డి, రాష్ట్ర బల్రాజుల డైరెక్టర్ మధుసూదన్ రాజు, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, బొట్టుస్వామి, సర్పంచులు అర్పిత, శ్రీధర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆదినారాయణ, ఎంపీటీసీ శకుంతలమ్మ, నాయకులు సూర్యనారాయణ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, నాగరాజు, నక్కల చిన్నప్ప, రంగారెడ్డి, శంకర, రామకృష్ణ దామోదర్ రెడ్డి, హరినాథ రెడ్డి, బాషా, విశ్వనాథ రెడ్డి, మల్ రెడ్డి, వెంకటరమణ నాయక్, మాధవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

నల్లమాడ: సంక్షేమ పథకాల సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దొన్నికోట గ్రామ సచివాలయం పరిధిలోని బొగ్గలపల్లి, బి.రామాపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. జగనన్న నేతృత్వంలో ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల్లోని పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్, పుట్టపర్తి ఎమ్మెల్యేగా మీ బిడ్డ దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. 'ఈ ప్రభుత్వంలో ఏ సమస్య లేకుండా సంతోషంగా ఉన్నాం. మళ్లీ ఈ ప్రభుత్వమే రావాలి సార్ అంటూ పలువురు మహిళలు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు'. అంతకుముందు ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, సర్పంచ్ రాగినేని సరస్వతి, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాల్‌నాయుడు, నాయకులు నాగరాజు నాయుడు, కమలాకర్ నాయుడు, ఎస్.గోపాల్‌నాయుడు, అంజి, డీలర్ రమణ, శంకర, బి.రమణ, బి.గంగులప్ప, శ్రీనివాసులు, నాగరాజు, ఎం.రామకృష్ణ, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్రనాయక్, అన్ని శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిమెంట్ దిమ్మె ధ్వంసంపై ఫిర్యాదు

కదిరి అర్బన్: మండల పరిధిలోని మల్లయ్యగారిపల్లిలో ఆదివారం సీసీ రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించిన సిమెంట్ దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చేశారు. ఆదివారం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సూర్యనారాయణకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. మల్లయ్యగారిపల్లి నుంచి కారెడ్డిపల్లి తండా వరకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఈనెల 16న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని గ్రామస్తులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా శిలాఫలాన్ని ఏర్పాటు చేసేందుకు సిమెంటు దిమ్మెను ఏర్పాటు చేశారు. ఈ దిమ్మెను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చేశారు. దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుకర్‌రెడ్డి, లోకేష్, సోమశేఖర్ రెడ్డి, ప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'పై శిక్షణ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని షాదీమాల్‌లో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు హాజరు కావాలని కోరారు.

నివాళి

అమడగూరు: మండలంలోని పత్రవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగారెడ్డి తల్లి ఎద్దుల జయమ్మ (62) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జయమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

అమడగూరు: మండలంలోని గాజులపల్లి సమీపంలో ఉన్న శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి పత్రవాండ్లపల్లికి చెందిన సూర్యనారాయణరెడ్డి నిత్యావసర సరుకులతో పాటు రూ.20 వేలను ఆదివారం విరాళంగా అందజేశారు. తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమానికి విరాళం అందజేసినట్లు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దాతకు ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతూ రైతు మృతి

తాడిమర్రి: మండలంలోని గుడ్డంపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కోడిమూర్తి ఓబన్న (42) గురువారం సొంత పనులపై తాడిమర్రికి వచ్చి ద్విచక్ర వాహనంలో గ్రామానికి బయలుదేరాడు. రాత్రి 8 గంటల సమయంలో బంగారంపేట గ్రామం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయం అయ్యింది. స్థానికులు అతడ్ని వెంటనే వైద్య చికిత్సల కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య శివమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ

తలుపుల: మండలంలోని ఓబులరెడ్డిపల్లికి చెందిన విశ్రాంత ఆర్‌ఐ పాపిరెడ్డి అనారోగ్యతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. టి.రెడ్డివారిపల్లిలో వేడి నీరు శరీరంపై పడటంతో కొండారెడ్డికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి పరామర్శించి తగు సలహాలు ఇచ్చారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఓడీచెరువు: మండల వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించి లేదన్నారు. అలాంటి వారికి సహకరిస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జూదరుల అరెస్ట్

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్డుకు ఉన్న పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కదిరి టౌన్: సీపీఎస్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.బి.భాస్కర్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో కదిరి తాలూకా గౌరవ అధ్యక్షుడు ఆత్మారెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని కోరారు. పీఆర్సీ అమలు చేసి, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. జీపీఎస్ వద్దని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వలసలాదేవి, రామాంజులు, కార్యదర్శి నాగమణి, నిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కోశాధికారి చిన్నయ్యశెట్టి, తదితరులు పాల్గొన్నారు.